




గృహజ్యోతి, మహాలక్ష్మి ప్రారంభం

- రూ.500కే గ్యాస్ సిలిండర్
- 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- ఉమ్మడి జిల్లాలో గృహజ్యోతికి 8.09 లక్షల దరఖాస్తులు
- సబ్సిడీ గ్యాస్ కోసం 9.34 దరఖాస్తులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లోని మరో రెండింటి అమలుకు శ్రీకారం చుట్టింది. 500 రూపాయలకే గ్యాస్‌సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారం భించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మహాలక్ష్మి వంట గ్యాస్ పథకం కోసం 9,33,997 మంది దరఖాస్తు చేసుకున్నారు. 8,09,496 మంది ఉచితంగా నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను పొందేందుకు ప్రజాపాలనలో అర్జీ పెట్టుకున్నారు. గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6వరకు జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న ప్రజల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. తెల్లరేషన్ కార్డు ఉండి ఆహార భద్రతా పథకం కింద లబ్ధి పొందుతూ రెగ్యులర్ గ్యాస్ కనెక్షన్ వినియోగిస్తున్న మహిళలకు 500 రూపాయలకు సిలిండర్‌ను అందివ్వ నున్నారు. మూడు సంవత్సరాల సగటు వినియోగం మేరకు సిలిండర్లను ఇస్తారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించు కునేవారికి జీరో బిల్లింగ్‌తో ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఇంటి యజమా నులతో పాటు అద్దెకు ఉన్నవారికి కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు.

● లబ్ధిదారుల గుర్తింపు ఇలా..

ఇంటి కనెక్షన్ నంబర్, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డును జతచేసి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారిని లబ్ధిదారులుగా గుర్తిస్తారు. గ్యాస్ కనెక్షన్ నంబర్, బ్యాంకుఖాతాలు, ఆధార్‌నెంబర్, ఆహారభద్రతా కార్డు నంబర్లను పరిశీలించి, వాటిని సమర్పించిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు. మహాలక్ష్మి లబ్ధిదారులు మొత్తం సిలిండర్ ధర చెల్లించి రీఫిల్ సిలిండర్‌ను తీసుకోవలసి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ కంపెనీలకు సబ్సిడీ సొమ్మును జమ చేస్తుంది. మార్కెటింగ్ కంపెనీలు లబ్ధిదారులు మొత్తం డబ్బు చెల్లించి సిలిండర్ తీసుకున్న తర్వాత సబ్సిడీని వారి ఖాతాల్లోకి జమచేస్తాయి. మహాలక్ష్మి పథకం కింద కరీంనగర్ జిల్లాలో 2,72,292 మంది, పెద్దపల్లి జిల్లాలో 2,01,702 మంది, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,65,274 మంది, జగిత్యాల జిల్లాలో 2,89,729 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన తర్వాత లబ్ధిదారులుగా గుర్తిస్తారు. గృహలక్ష్మి పథకం కోసం కరీంనగర్ జిల్లాలో 2,35,091, పెద్దపల్లి జిల్లాలో 1,76,410, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,42,964, జగిత్యాల జిల్లాలో 2,55,031 దరఖాస్తులు వచ్చాయి.

● కాంగ్రెస్‌శ్రేణుల సంబురాలు

ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లోని మహలక్ష్మి, గృహలక్ష్మి పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడం పట్ల జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్‌శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో పార్టీనాయకులు స్వీట్లను పంపిణీ, సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు చేస్తూ హర్షం వ్యక్తం చేశారు.


తెలంగాణ చౌక్‌లో స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు


పరీక్షాకేంద్రంలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని వారు సూచించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని తెలిపారు.

■ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజోతి, కరీంనగర్

రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 27: రేకుర్తిలో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర హుండీలను రాజరాజేశ్వర కల్యాణ మండపంలో మంగళవారం లెక్కించారు. మెత్తం 21 హుండీలను కొత్తపల్లి స్టేషన్ నుంచి పోలీసుల భద్రత మధ్య తరలించారు. టూ టౌన్ పోలీసుల సమక్షంలో హుండీల సీళ్ల విప్పారు. నోట్ల రూపంలో 20.65 లక్షలు, నాణాల రూపంలో 85,985, మొత్తం 21.53 లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్లు జాతర అధికారి ఎండపెల్లి మారుతి తెలిపారు. మిశ్రమ బంగారం 15 గ్రాములు, మిశ్రమ వెండి కిలో మూడు వందల నాలుగు గ్రాములు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, జాతర కమిటీ చైర్మన్ పి శ్రీనివాస్, సభ్యులు, గోవిందపతి శ్రీవారి సేవా సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 27: ఇంటర్‌మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించాలని అధికారులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఆదేశించారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు బస్సు ఆపమన్న చోట ఆపాలని, పరీక్షా కేంద్రాల వద్ద బస్సు ఎక్కే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు ఇంటర్‌మీడియట్ పరీక్షలు బాగా రాసి మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 17: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సెక్టర్ ఆఫీసర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, తప్పులు జరగకుండా జాగ్రత్త పడాలని కలెక్టర్ పమేలాసత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటో రియంలో ఎన్నికల విధులు నిర్వర్తించే సెక్టార్ ఆఫీసర్స్‌కు శిక్షణ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై ప్రశాంత వాతావరణంలో కిందిస్థాయి సిబ్బందితో కలిసి చక్కగా పనిచేయాలని సూచించారు. సామగ్రి డిస్ట్రిబ్యూషన్ నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసు కోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే అధికారుల దృష్టికి, తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారంగా పనిచే యాలని, ఎవరూ నిర్లక్ష్యంగా ఉండవద్దని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రానికి ఒక వీల్ చైర్‌ను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, ఎన్నికల మెటీరియల్ నోడల్ ఆఫీసర్ మాధవి, డిస్ట్రిక్ లెవల్ మాస్టర్ ట్రైనర్ కనకయ్య, ఎంఈవో మధుసూదనాచారి, ట్రైనర్లు తిరుపతిరెడ్డి, రజనీష్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పరుశురాములు, సంపత్ పాల్గొన్నారు.

కారులో మంటలు

- క్షేమంగా బయటపడ్డ ఐదుగురు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 27 : పట్టణంలోని సుధాకర్ పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం రాత్రి ఓ కారులో మంటలు చేలరేగాయి. కారులో నుంచి మంటలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే మంటలను ఆర్పేశారు. దీంతో కారులో ఉన్న ఐదురుగురు క్షేమంగా బయటపడ్డారు. పెట్రోల్ బంక్ సమీపంలోనే కారులో మంటలు చెలరేగడంతో స్థానికులు భయందోళనకు గురయ్యారు.

బండి సంజయ్ వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు

- ఉల్లంపల్లి వద్ద ప్రజాహిత యాత్రను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకుల యత్నం
- జిల్లా వ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనం

చిగురుమామిడి, ఫిబ్రవరి 27: బీజేపీ జాతీయ ప్రదాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిర్వహిస్తున్న ప్రజాహిత యాత్రను అడ్డుకోవడానికి కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు అడ్డుకోవడానికి మంగళవారం తీవ్ర ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవరాం రాత్రి బండి సంజయ్ బస చేశారు. యాత్ర సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్‌కుమార్ అనుచిత వ్యాఖ్యాలు చేశాడని, అందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు బండి సంజయ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దిష్టిబొమ్మను దహనం చేశారు. బండి సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ కార్య కర్తలు, నాయకులు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు బండి సంజయ్ ప్రజాహిత యాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు తిమ్మాపూర్ సీఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టిశివయ్య, సంజీవ్‌రెడ్డి, వీరన్ననాయక్, ఐలయ్య,యెన్నం రాజు,రమేష్‌నాయక్, బాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.


ఉల్లంపల్లి శివారులో కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు


మహిళా నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

● సీపీ, టౌన్ ఏసీపీకి కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

కరీంనగర్ క్రైం: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై, ఆయన కుటుంబంపై అనుచిత వాఖ్యలు చేసిన ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.టౌన్ ఏసీపీ నరేందర్‌కు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళాలోకాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడిన సంజయ్ క్షమాపణ చెప్పాలన్నారు. ఇంకోసారి పొన్నం ప్రభాకర్ పై ఆరోపణ లు చేస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నగర అధ్యక్షుడు బోనాల శ్రీని వాస్, డీసీసీ కార్యదర్శి రామిడి రాజిరెడ్డి, వంగల విద్యా సాగర్, గంగుల దిలీప్, అక్బర్, జాఫర్, చెర్ల పద్మ, నేరెళ్ళ కవిత, సుజా త, జ్యోతిరెడ్డి, లావణ్య, స్వప్న, మహాలక్ష్మి, సత్య పాల్గొన్నారు.


తెలంగాణచౌక్ సమీపంలో ధర్నాచేస్తున్న కాంగ్రెస్‌నాయకులు,

● తెలంగాణ చౌక్ వద్ద

గణేశ్‌నగర్: కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకుని దిష్టిబొమ్మను లాక్కోవడంతో ఆర్ట్స్ కళాశాల గేట్ వరకు వచ్చి రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, రహమత్ హుస్సేన్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, చర్ల పద్మ, కొరివి అరుణ్‌కుమార్, శ్రావణ్‌నాయక్, అబ్దుల్ రహెమాన్, స్వామి గౌడ్, బోనాల శ్రీనివాస్, అఖిల్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 27: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాల జీవోను వెంటనే సవరించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, అసంఘటిత కార్మికులందరికి పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. స్ట్రీట్ వెండర్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలని, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, నేషనల్ హెల్త్ కమిషన్ పరిధిలో పనిచేసే కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. బీడి కార్మికులందరికీ ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేయాలని, రాష్ట్రంలో దారి మళ్లించిన 1004 కోట్ల రూపాయలను భవన నిర్మాణ కార్మికుల బోర్డులో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో పసుల శ్రవణ్, తొర్తి శ్రీనివాస్, రేణికుంట శంకర్, మొగిలిపాలెం తిరుపతి, నక్క అరుణ్, రమణయ్య, శ్రీను, కళ, చిన్నవ్వ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 27: ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకొని, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని డీఆర్వో పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద 2కె రన్‌ను డీఆర్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక వృద్ధి సాధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు ఈనెల 26 నుంచి మార్చి 1 వరకు జరుగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో 250 మంది విద్యార్థులు, యువకులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోను కాల్స్‌కు ఎవరు స్పందించవద్దని సూచించారు. కార్యక్ర మంలో యూబీఐ డీజీఎం అపర్ణ, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామచంద్రుడు, డీఈవో జనార్దన్‌రావు, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, స్పోర్ట్స్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి పద్మావతి పాల్గొన్నారు.



జెండా ఊపి 2కె రన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌వో పవన్‌కుమార్

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 27: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారు చేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



బద్ది పోచమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

రైల్వే ప్లాట్ ఫాంపై వ్యక్తి మృతి

జమ్మికుంట,ఫిబ్రవరి27: జమ్మికుంట రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డాడు.రామగుండం రైల్వేహెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన ఔట్‌పేషెంట్ చీటి ఉందని అందులో అతడి పేరు సాగర్ తండ్రి జితేందర్ అని ఉన్నట్లు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. బ్లూ కలర్ ఫుల్ షర్ట్ దానిపై పసుపు రంగు నిలువు గీతల డిజైన్ బ్లాక్ లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రజల బాగోగులు తెలుసుకునేందుకే బీజేపీ యాత్ర

తిమ్మాపూర్, ఫిబ్రవరి27: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజల బాగోగులు తెలుసుకోవడం కోసమే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర చేపట్టారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ అన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో మార్చి 2 నుంచి జరగబోయే యాత్రకు సంబంధించి తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎంపి బండి సంజయ్ చేస్తున్న ప్రజాహిత యాత్రపై రాళ్ల దాడి చేసిన కాంగ్రెస్ నాయకుల చిల్లర బుద్ధులను ప్రజలు గమనిస్తున్నారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బండి సంజయ్ మాటలను వక్రీకరించి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగు నీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండదని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కార హీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెర లేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

నకిలీ డాక్యుమెంట్ల కేసులో మరొకరి అరెస్టు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27: నకిలీ డాక్యుమెంట్లతో భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో చిట్యాల కిష్టమ్మ(75)ను మంగళవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో జైలుకు తరలించినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ నెల 20న కొత్తపల్లికి చెందిన కనుకారెడ్డి ఫిర్యాదుతో నందెల్లి మహిపాల్‌తో పాటు 9 మందిపై నమోదైన కేసులో ఏ1 కిష్టమ్మను అరెస్టు చేశామని తెలిపారు.

హెచ్ఐవీ బాధితులకు చేయూత అందించాలి

● రాష్ట్ర ఏయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 27: హెచ్ఐవీ బాధితులకు చేయూత అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి అన్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలకు ఇండెక్స్ పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జాతీయ ఏయిడ్స్ నియంత్రణ సంస్థ విభాగాల డాక్టర్లతో పాటు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఐసీటీ, పీపీటీసీటీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ కేంద్రాల కౌన్సిలర్లు, డాక్టర్లు, ఎన్‌జీవో ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. రిస్క్ గ్రూపు వారిని గుర్తించి, ఏఆర్‌టీ మందులను సక్రమంగా అందించాలని సూచించారు. ఎస్‌పీసీసీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్ష్యరాస్యులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీ సాక్స్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, జాయింట్ డైరెక్టర్లు కరుణశ్రీ, మేఖల, అసిస్టెంట్ డైరెక్టర్ ఇందిరా, సేతు మాదవ్, కన్సల్టెంట్ డాక్టర్లు డాక్టర్ పార్థసారధి, డాక్టర్ లేహర్‌వాణి, డీటీసీవో డాక్టర్ రవిందర్‌రెడ్డి, డీఏపీసీయూ మేనేజర్ సురేందర్‌రెడ్డి, పీఆర్ శ్రీనివాస్, సురేందర్, సుమన్, రమేశ్, శ్రీనివాస్, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఒకరి రిమాండ్

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27: భూమి కొనుగోలు విషయంలో తప్పించుకొని తిరగడంతో పాటు కులం పేరుతో దూషించిన సంఘటనలో గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన నర విద్యాసాగర్ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఈ ఘటనపై మంగళవారం డీఎస్పీ భీమ్‌శర్మ విచారణ చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన భూక్య నరేష్ నాగంపేటకు చెందిన విద్యసాగర్‌రెడ్డి దగ్గర రూ.47 లక్షలకు భూమి కొనుగోలు చేసి 15 లక్షలు చెల్లించారు. నరేష్ మిగతా డబ్బులు చెల్లించేందుకు విద్యాసాగర్ రెడ్డికి ఫోన్ చేసినా స్పందించకుండా తప్పించుకొని తిరగడంతో సోమవారం కనిపించాడు. నరేష్ మిగతా డబ్బులు చెల్లిస్తా నా భూమి ఎక్కడ ఉందో చూపించమంటూ అడగడంతో కులం పేరుతో విద్యాసాగర్‌రెడ్డి ఆయనను దూషించారు. కులం పేరుతో దూషించడంతో నరేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. నరేష్ ఫిర్యాదుతో కులం పేరుతో దూషించిన విద్యాసాగర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో సింగరేణి కార్మికుడు మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27: గోదావరిఖని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని డ్రైన్‌లో మంగళవారం రాత్రి పూరెళ్ల సాగర్(35) అనే వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక మిలీనియం క్వార్టర్స్‌లో నివాసముండే సాగర్ జీడీకే 1ఇంక్లైన్‌లో పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో సింగరేణి ఆసుపత్రిలో చేరిన ఆయన శుక్రవారం నుంచి కనబడడం లేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కొంత కాలంగా కుటుంబ వివాదాలతో భార్య కాపురానికి రావడం లేదు. మృతదేహంపై పలు చోట్ల గాయాలున్నాయి. వన్‌టౌన్ పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు.

రెండు రోజుల క్రితం సాగర్ నడుచుకుంటూ వచ్చినట్లు ఫుటేజీ లభించింది. కాగా సాగర్ తల్లి అమ్మాయి తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, అతని మృతిలో భార్య, అత్తింటి వారి ప్రమేయం ఉన్నట్టు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ ఎస్ఐ సమ్మయ్య ఘటన స్థలంలో పరిశీలన జరిపారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో వేగం పెంచాలి

● సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ, ఫిబ్రవరి 27: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మార్చి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఏర్పాట్లను ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 3 షిఫ్టుల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని, తాత్కాలిక పార్కింగ్ లాట్స్‌ను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు. శివ భక్తుల కోసం సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశించుకున్న ప్రకారం జాతర ప్రారంభ సమయానికి పనులు పూర్తి చేయాలని, ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణం, జాతర పరిసరాలను నిరంతరం శుభ్రం చేయించాలన్నారు. మానిటరింగ్‌కు సెక్టార్ల వారీగా సంబంధిత అధికారులను నియమించాలని, మున్సిపల్, టెంపుల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతర సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. అవసరం మేరకు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, దేవస్థానం క్యూలైన్లు, పరిసర ప్రాంతాల్లో రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని, ప్రతీ 100 మీటర్లకు తాగునీటి ట్యాపులను ఏర్పాటు చేయాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, జాతర ప్రాంగణ మొత్తం సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, ఆలయ ఈఈ రాజేష్, ఏఈవో జయ కుమారి, టౌన్ సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

● జాతర ఏర్పాట్లపై నేడు సమీక్ష

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై బుధవారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

భూమి నకిలీ పత్రాలు సృష్టించిన ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27: తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలో భూమి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. తంగళ్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ శివారులో 45 సంవత్సరాల క్రితం గుర్రం అంజయ్య కొనుగోలు చేసిన భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ భూమిని తంగళ్లపల్లికి చెందిన కోడి అంతయ్య ఆక్రమించాలనే ఉద్దేశంతో గుర్రం అంజయ్యను అతడి కుటుంబ సభ్యులను బెదిరించి భూమి కబ్జా చేశాడు. తంగళ్లపల్లి శివారులోని శోభ భూమిలోకి సైతం అక్రమంగా ప్రవేశించినందుకు అతడిపై మరో కేసు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు. అదే విధంగా తంగళ్లపల్లి మండలంలోని అంకుసాపూర్ సర్వే నంబర్ 160లో రెండు గుంటల భూమి తన పేరును లేకపోయినా ఉన్నదని నమ్మించి చిలుక శ్రీనివాస్ అనే వ్యక్తితో ఒప్పందం చేసుకొని అతని వద్ద నుంచి రూ .8.40 లక్షలు తీసుకున్న వట్టిమల్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామన్నారు. భూ కబ్జాలకు సంబంధించి ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ అన్నారు. జిల్లాలో భూ కబ్జాలు చేస్తూ, భూమి నకిలీ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలన్నారు.

దేవుడి పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 27: బీజేపీ దేవుడి పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ మత రాజకీయాలు చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ గజ్జెల కాంతం విమర్శించారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు సహించరానివన్నారు. బండి సంజయ్ మతి స్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఈ సారి బండి సంజయ్‌కి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందన్నారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తరువాత ఇప్పటి వరకు కేంద్రం నుంచి ప్రత్యేకంగా ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. రాముడు దేశ ప్రజలందరి ఆరాధ్య దేవుడన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కాగ్ రిపోర్ట్‌లో గత రాష్ట్ర ప్రభుత్వంలో రూ.3 లక్షల కోట్లు అవినీతిపై సీబీఐ, ఈడీ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంతోనే లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కవితను అరెస్టు చేయటం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవితల అవినీతిపై విచారణ జరపాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి



అంజన్న ఆలయం వద్ద భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 27: కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. సమ్మక్క సారక్క భక్తుల రద్దీ దృష్ట్యా నిలిపి వేసిన వాహనపూజలు, అభిషేకాలు పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కమలాకర్ (ఫైల్)

బోయినపల్లి, ఫిబ్రవరి 27: బోయినపల్లి మండలంలో ద్విచక్రవాహనాన్ని లారీ అతివేగంగా ఢీకొనడంతో గంగాధర మండలం పిట్టలపల్లికి చెందిన గోదాల కమలాకర్ (45) మంగళవారం అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. గంగాధర మండలం పిట్టలపల్లి గ్రామానికి చెందిన కమలాకర్ కోర్టు కేసు నిమిత్తం వేములవాడకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. బోయినపల్లి మార్కెట్ యార్డు సమీపాన ఇటుక బట్టీల యజమానులు డంప్ చేసిన మట్టి నిల్వలను తరలించేందుకు లారీ వస్తోంది. లారీ డ్రైవర్ వాహనాన్ని అతి వేగంగా కమలాకర్ ద్విచక్ర వాహనాన్ని వెనక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కమలాకర్ లారీ కింద పడి అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని మృతుని కుటుంబసభ్యులను అందోళనను విరమింప జేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తి సిరిసిల్ల జిల్లా అసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చుసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27 : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు (44) బెహరన్ దేశంలో మృతి చెందగా మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. నిమ్మల రాజు గత పదేళ్లుగా బెహరన్ వెళ్తున్నాడు. అక్కడ ఓ కంపనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజు గుండెపోటుతో మృతి చెందాడు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

చొప్పదండి, ఫిబ్రవరి 27: చొప్పదండి జెడ్‌పి బాలుర పాఠశాలకు చెందిన 13 మంది బాలికలకు ఉమెన్స్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ మంగళవారం సైకిళ్లను పంపిణీ చేసింది. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జమున, ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, పీడీ కృష్ణ పాల్గొన్నారు.

మానసాదేవి ప్రతిష్ఠాపన మహోత్సవం

కోరుట్ల, ఫిబ్రవరి 27: పట్టణంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం మానసాదేవి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ మంత్రోశ్చరణ మధ్య ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలో ఉన్న పాము పుట్ట వద్ద నాగేంద్ర సహిత మానసాదేవి ప్రతిష్ఠాపన జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యహవాచనం కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు.



ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు, వేదపండితులు

కరాటే పోటీల్లో కోరా జాన్సన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 27: జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఈనెల 25న నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో కోరా జాన్సన్ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో ఎం మనస్విని కాంస్య పతకం, అనన్య రజిత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వర ఆలయం

-మార్చి 1న శ్రీవారి కల్యాణోత్సవం



ముస్తాబైన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 27: నగరంలోని విద్యానగర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు, యజ్ఞాచార్యులు వాన మామల్లై పవనకుమారాచార్యుల వైదిక నిర్వహణలో బుధ వారం నుంచి నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మార్చి 2వతేదీ వరకు 4 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి తెలిపారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 6గంటల నుంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహ వాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, గురు వారం ఉదయం యాగశాలాప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు, ధ్వజారోహణం, సాయంత్రం హంసవాహనసేవ, ఎదుర్కోలు, శుక్రవారం ఉదయం 10-30 గంటల నుంచి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, శనివారం ఉదయం మహాపూర్ణాహుతి, అభిషేకం, చక్రస్నానం, సాయంత్రం గరుడవాహనసేవ, శ్రీపుష్పయాగం, ద్వాదశారాధనలు, సప్తా వరణాలు, ఏకాంతసేవ జరుగుతాయని పేర్కొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో పాఠశాల పాత్ర కీలకం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27: విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో పాఠశాల, కుటుంబం పాత్ర కీలకమని లక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ముస్తాక్ అలీ అన్నారు. మంగళవారం నగరంలోని లక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన లక్ష్ మినీ ఫెస్టివల్‌ను జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. క్వాంటం మైండ్ ఐక్యూ డైరెక్టర్ జోసెఫ్ జాన్సన్, సీఈవో క్లైమెంట్ రాజు వ్యవహరించారు. లక్ష్ మినీ ఫెస్టివల్ వేదికగా శాస్త్ర సాంకేతిక రంగంలో నూతన ఒరవడి అయిన డెర్మటోగ్లిఫిక్స్ మల్టిపుల్ ఇంటెలిజెన్సు టెస్ట్‌ని క్వాంటం మైండ్ ఐక్యు కరీంనగర్‌కు పరిచయం చేశారు. దీని ద్వారా కేవలం వేలి ముద్రల ద్వారా పిల్లల్లోని సహజమైన మేధస్సుని గుర్తించవచ్చని అన్నారు. దీనితో విద్యార్థి తన మెదడుకు సరితూగ గల ఆధిపత్యం ఉన్న రంగంలో అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. ఈ సాంకేతికత జన్యు శాస్త్రానికి అనుబంధంగా పనిచేస్తూ పిల్లల్లోని మానసిక సమస్యలను పరిష్కరించ గలుగుతుందని క్వాంటం మైండ్ ఐక్యూ డైరెక్టర్ జోసెఫ్ జాన్సన్, సీఈవో రాజు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ షేక్ అఫ్సానా పాల్గొన్నారు.

దుర్శేడ్ పీఏసీఎస్ చైర్మన్‌గా తిరుపతి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 27: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ పీఏసీఎస్ చైర్మన్‌గా తోట తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దుర్శేడ్ చైర్మన్‌గా ఉన్న బల్మూరి ఆనందరావు మృతిచెందడంతో ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోనె నర్సయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు సంపత్‌రావు, శ్రీకాంత్, మల్లారెడ్డి, డైరెక్టర్, ఎన్నికల అధికారి గీతా రాణి, కోరుకంటి వేణుమాధవరావు, సిఓ వేణుమాధవ్, సంపత్ పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవం కోసం అంబేద్కర్ కృషి



అల్గునూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఫిబ్రవరి27: దళితుల ఆత్మగౌరవం కోసం అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు. అలుగునూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌కు ముఖద్వారంగా ఉండే అలుగునూర్ చౌరస్తాలో అంబేత్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వం రోడ్డు విస్తరణలో భాగంగా అంబేత్కర్ విగ్రహాన్ని ఏర్పాటును విస్మరించారని మండిపడ్డారు. మానకొండూర్ నియోజకవర్గంలోని గ్రామాల్లో అంబేత్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. అంబేత్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అంబేద్కర్ దారిలో నడవాలన్నారు. కార్యక్రమంలో అంబేత్కర్ సంఘ నాయకులు గూడ కనకయ్య, సిరిసిల్ల చంద్రయ్య పాల్గొన్నారు.

'దళితబంధు డబ్బులు నిలిపివేయించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి'

హుజూరాబాద్, ఫిబ్రవరి 27: హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దళితబంధు రెండో విడత డబ్బులు నిలిపివేయించారని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సొల్లు బాబు అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చే దళితబంధు డబ్బులను ఎమ్మెల్యేగా గెలవడం కోసం కౌశిక్‌రెడ్డి కలెక్టర్‌తో చెప్పి నిలిపివేయించారన్నారు. దళితులను రెచ్చగొడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రాజకీయం చేస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రెండో విడత దళితబంధు డబ్బులను ఎమ్మెల్యే ఎందుకు ఇప్పించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కొల్లూరి కిరణ్, వేముల పుష్పలత, ఎండీ అప్సర్, సుశీల, శంకర్, రాజు, సదానందం, రామచంద్రం, శ్రావణ్, రమేష్, నర్సింగ్, రాజయ్య పాల్గొన్నారు.

ఏఐ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 27: భవిష్యత్తులో ఏఐ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు వస్తాయని హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి. మనోజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ కె. శంకర్ అధ్యక్షతన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆర్పీ-22, పాపులర్ సైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఎన్నో ఉపాయోగాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాధిపతులు రాజేశ్వర్‌రావు, డాక్టర్ ఎంవి సతీష్‌కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ మల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయానికి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ విరాళం

గంగాధర, ఫిబ్రవరి 27: మండలంలోని బూరుగుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయానికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దీవెన దంపతులు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయానికి దర్వాజ, పోచమ్మ విగ్రహం, ఆలయ నిర్మాణానికి 1,00,116 రూపాయలు విరాళంగా అందించారు. వారి వెంట నాయకులు మహిపాల్‌రావు, దూళం శంకర్‌గౌడ్ ఉన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసనలు



కరీంనగర్, గంగాధరలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 27: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను బొమ్మకల్ మౌలానా అబుల్ కలామ్‌చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ షహన వాజ్, అబ్దుల్ రహ్మాన్, ఎస్ఏ మోహసీన్, షహభాజ్, రాజ్‌యాదవ్, మహ్మద్ పాషా, ఇమ్రాన్, ఖలీమ్, జాకీ, అస్లం తదితరులు పాల్గొన్నారు.

'బండి సంజయ్ సంస్కారహీనుడు'

కరీంనగర్ అర్బన్: ఎంపీ బండి సంజయ్ సంస్కారహీనుడని, ఆయన చేసిన అభివృద్ధి పనులు ఏమీ లేక కాంగ్రెస్ నేతలపై విమర్శలు చేస్తున్నారని డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో మండిపడ్డారు. పొన్నం ప్రభాకర్, ఆయన తల్లిని ఉద్దేశించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల పట్ల అతను ఎంతటి సంస్కారహీనుడో అర్థమవుతోందన్నారు.

●మంత్రి పొన్నంను విమర్శించే నైతికహక్కు ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు లేదని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముల్కల ప్రవీణ్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గాల సమన్వకర్త రహమత్ హుస్సేన్, సేవాదల్ సీనియర్ నాయకులు ముస్తాక్ అహ్మద్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

●అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ నాయకులు కిమ్ పహద్ ఒక ప్రకటనలో బండి సంజయ్‌కు హితవు పలికారు.

●కరీంనగర్ అర్బన్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు లేదని ఏఐసీసీ ఏటీసీ కోఆర్డినేటర్ రుద్ర సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

●ఎంపీ దిష్టిబొమ్మ దహనం

రాజీవ్‌చౌక్‌లో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ మోసిన్, నాయకులు ఇమ్రాన్, కాసీం, షానవాజ్ మహ్మద్ పాషా, ఖలీం పాల్గొన్నారు.

●**సుభాష్‌నగర్:** మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మంద నగేశ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

●**మానకొండూర్:** మానకొండూర్‌లోని పల్లెమీద బస్టాండ్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, మండల అధ్యక్షులు రవీంద్రాచారి, జిల్లా కార్యదర్శి గసిగంటి సంపత్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వరహాల చారి, ఎంపీటీసీ సంపత్, పెంచాల రాజయ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

●**హుజూరాబాద్:** మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ బండి సంజయ్‌పై హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సొల్లు బాబు, కొల్లూరి కిరణ్, తౌసీఫ్, అప్సర్, మిడిదొడ్డి రాజు, రమేష్, రవీందర్, శంకర్, సంపత్ పాల్గొన్నారు.

●**చొప్పదండి:** ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిలు ఎస్ఐ ఉపేంద్రచారికి ఫిర్యాదు చేశారు.

●**వీణవంక:** ఎంపీపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు నల్ల కొండాల్ రెడ్డి, గంగాడి రాజిరెడ్డి, మదుకర్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్, అన్వర్, సునీల్ పాల్గొన్నారు.

●**గంగాధర:** గంగాధరలో కాంగ్రెస్ నాయకులు ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మనోహర్, నియోజకవర్గ యూత్ నాయకుడు యగ్నేష్ పాల్గొన్నారు.

●**ఇల్లందకుంట:** మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రామారావు ఆధ్వర్యంలో ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీస్ స్టేషన్లో బండి సంజయ్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వంగ రామకృష్ణ, మహేష్, సంపత్ పాల్గొన్నారు.

●**శంకరపట్నం:** శంకరపట్నం మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనంచేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మండలాధ్యక్షుడు బసవయ్య పాల్గొన్నారు.

●**గన్నేరువరం:** మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సునీల్, గ్రామ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**తిమ్మాపూర్:** అలుగునూర్‌లో ఎంపీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

జమ్మికుంట రూరల్: పట్టణంలో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'బండి సంజయ్‌కి వస్తున్న ఆదరణ చూసి ఓర్వ లేక దాడి'

గంగాధర, ఫిబ్రవరి 27: ప్రజాహిత యాత్రలో బండి సంజయ్ కుమార్‌కు వస్తున్న ప్రజాదరణను ఓర్వక మంత్రి పొన్నం ప్రభాకర్ అడ్డుకోవాలని చూస్తున్నారని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ ఆరోపించారు. ఈసందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను గంగాధరలో దహనం చేశారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 6 గ్యారంటీల అమలులో విఫలమై ప్రజల దృష్టిని మరల్చడానికి బండి సంజయ్ యాత్రపై కాంగ్రెస్ నాయకులు రాళ్లతో దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, రాజేంద్ర ప్రసాద్, పెంచాల రాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పంటలకు యూరియాతో పాటు పొటాష్ వేయాలి

● ఏఈవో నిఖిల్ కుమార్

సైదాపూర్, ఫిబ్రవరి 27: రైతులు తమ పంటలకు ఎరువులు వేసేటప్పుడు యూరియా, ఇతర ఎరువులతో పాటు పొటాష్ తప్పని సరిగా వేయాలని ఏఈవో నిఖిల్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం సైదాపూర్ రైతు వేదికలో రైతులకు వివిధ పంటలలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ పొటాష్ వాడిన మొక్కలకు తెగుళ్లను తట్టుకునే శక్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

గింజ సరిగా కట్టడానికి ఉపయోగ పడి, గింజ గడ్డిగా ఉంటుందన్నారు. ఇప్పుడు ఎక్కువగా వరి పంటలలో జింకు లోపం కనిపిస్తుందని లీటరు నీటిలో రెండు గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి అయిదు రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారి చేయాలన్నారు. ప్రతిసారి వరి పండించే భూములలో రబీ సీజన్‌లో జింకు తప్పని సరిగా వేయాలన్నారు. ఈకార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



హుజూరాబాద్‌లో గ్యాస్ సిలిండర్‌లతో హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



శంకరపట్నంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 27 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కమాన్ చౌరస్తాలో కాంగ్రెస్ సీనియర్ నాయకు రాలు మల్లిఖార్జున శైలజ ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6గ్యారంటీల స్కీంలో భాగంగా మహాలక్ష్మి పథకంలోని మరో రెండు గ్యారంటీలైన గ్యాస్ సిలిండర్‌ను రూ.500కు, 200 యూనిట్లు విద్యుత్ ఉచిత పథకాలను అమలును ప్రారంభించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు బత్తిని చంద్రయ్య, కుమార్, ప్రభాకర్, సుజాత, పద్మ, లావణ్య, లలిత, రజిత, సరోజన, మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

●**గణేశ్‌నగర్:** మహాలక్ష్మి పథకంలో ఆరు గ్యారెంటీల స్కీమ్‌లో భాగంగా మరో 2 గ్యారంటీలను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి అమలు పరచడంతో హర్షం వ్యక్తం చేస్తూ కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ లో స్వీట్లు పంచుతూ సంబరాలు ఘనంగా చేపట్టారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్యారెంటీ పథకాల్లో భాగంగా 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, ఉచిత 200 యూనిట్ల కరెంట్ బిల్లు పథకాలను నేటి నుండి అమలు పరచడంతో సంబరాలు నిర్వహించినట్లు తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఈ పథకం వల్ల వెసలుబాటు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్, ఫిబ్రవరి 27:** హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌ను ప్రకటించడాన్ని హర్షిస్తూ మంగళవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో మాట ఇచ్చిన ప్రకారం ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో వేముల పుష్పలత, లావణ్య, సుశీల, మల్లేశ్వరి, సునీత, రాధ, లక్ష్మి, కరిమా, మం జు, సొల్లు బాబు, కొల్లూరి కిరణ్, తౌసీఫ్, అప్సర్, మిడిదొడ్డి రాజు, రమేష్, రవీందర్, శంకర్, సంపత్, కిరణ్, రియాజ్, షాదీక్, ఖాలీద్ హుస్సేన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● **శంకరపట్నం:** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలలో మరో రెండు పథకాలను మంగళవారం ప్రారంభించడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కూడలిలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు.

తహసీల్దార్‌కు వినతి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 27 : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు వంతడుపుల బాబు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 28న సివిల్ రైట్స్‌డేను ప్రత్యేకంగా నిర్వహించి, దళితులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా తిరుపతి

చొప్పదండి, ఫిబ్రవరి 27. కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా చొప్పదండికి చెందిన యామ తిరుపతిని నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం న్నియమక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు తిరుపతి ధన్యవాదాలు తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆత్మ పీడీ ప్రియదర్శిని

శంకరపట్నం, ఫిబ్రవరి 27: వరి పంటను ఆశించే తెగుళ్ల నివారణ సస్యరక్షణ చర్యలపై ఆత్మ పీడీ ప్రియదర్శిని రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని తాడికల్ రైతువేదికలో రైతులకు వరి పైరులో ప్రధానంగా పిలకలు వేసే దశలో మొగి పురుగు ఆశిస్తుందని, సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే చీడపీడలు ఆశ్రయించి పంట దిగుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్, మల్లాపూర్ రైతు వేదికలలో వరిలో చీడ, పీడల యాజమాన్యం, రసాయన ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మమత హాజరై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వినియోగం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వవివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు స్వామి, రఘు, పంచాయతీ కార్యదర్శి పద్మ, రైతులు పాల్గొన్నారు.

సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు కాంగ్రెస్ నాయకులు

సైదాపూర్, ఫిబ్రవరి 27: హుస్నాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎంపీ బండి సంజయ్ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బండి సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునేందుకు చిగురుమామిడి మండలం సుందరగిరి వద్ద రోడ్డుపై కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అందులో భాగంగా కొంత మందిని సైదాపూర్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బేషరతుగా క్షమాపన చెప్పాలన్నారు. అశోక్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సంజీవరెడ్డి, రాజు, శివారెడ్డి ఉన్నారు.



సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

విద్యార్థి దశ నుంచే దేశభక్తి పెంపొందించాలి : ఎంపీ

చిగురుమామిడి, ఫిబ్రవరి 27: విద్యార్థి దశ నుంచే బాలబాలికల్లో దేశభక్తి పెంపొందించాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనపల్లిలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే విద్యతో పాటు దేశం, భద్రత, అభివృద్ధి అనే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రజాహిత యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయ కులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంపత్ కుమార్, పైడిపల్లి శ్రీనివాస్, పోలోజ్ సంతోసకుమార్, పొన్నం శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్, అనిల్ మొగిళి, తిరుపతి పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 27 : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో టీ. సునీతకు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితబంధు పథకానికి సంబంధించిన రెండో విడుత నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేసేలా చర్య లు చేపట్టాలని కోరారు. రెండో విడుత నిధులు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, శ్రీకాంత్, రాజు, సదానందం, అశోక్, సందీప్, సాగర్ తదితరులు ఉన్నారు.

అలరించిన ఫేర్‌వెల్ డే

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 27 : పట్టణంలోని న్యూ శాతవాహన ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు రాబోయే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

'దళితబంధు డబ్బుల కోసం ఆందోళన చెందవద్దు'

హుజూరాబాద్: నియోజకవర్గంలోని దళితులు దళిత బంధు రెండో విడత డబ్బుల కోసం దళితులెవరూ ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత దళితబంధు డబ్బుల విషయంలో ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుల దృష్టికి తీసుకెళ్లారన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లిని కలిసిన ట్రాన్స్‌పోర్ట్ ఉప కమిషనర్

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఇటీవల జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పురుషోత్తం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాద పూర్వ కంగా కలిశారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్స్పె క్టర్లు రవికుమార్, చక్రవర్తి ఉన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక దినోత్సవం

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు సుద్దాల శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి కల్యాణం

శంకరపట్నం: మండలం మొలంగూర్ గ్రామంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మానకొండూర్, ఫిబ్రవరి 27 : మండలంలో బుధవారం నుంచి జరుగనున్న ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, దేవంపల్లిలోని గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యం అయినా అనుమతి ఉండదని, కాపీయింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు అవుతుందని చీఫ్ సూపరింటెండెట్స్ శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

● గంగాధర : ఇంటర్ పరీక్షలకు గంగాధరలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గంగాధరలో 4 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. గతంలోని మోడల్ స్కూల్లో నిర్వహించిన కేంద్రాన్ని ఈ సారి విద్యార్థుల కు అనువుగా ఉండే జ్యోతిబాపూలే బాలికల కేంద్రానికి మార్చారు. మొదటి రోజు ప్రభుత్వ జూనియర్ కళాశా లలో 186, మైనారిటీ స్కూల్లో 213, జ్యోతి బాపుపూలే గురుకుల పాఠశాలలో 207, తేజశ్విని జూనియర్ కళాశాలలో 350మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

'కేసీఆర్‌ను విమర్శిస్తే ఊరుకోం'

చిగురుమామిడి,ఫిబ్రవరి 27: కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌కుమార్‌కు మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రజాహిత యాత్రలో బీఆర్ఎస్‌ను కించపరిచే విధంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను విమర్శిస్తే తగిన గుణపాఠం చెప్పకతప్పదని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు, యావత్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్ ఆదర్శంగా తీసుకుని రాజకీయం నేర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్‌లు సుద్దల ప్రవీణ్, జక్కుల రవీందర్,సన్నీల్ల వేంకటేశం, బొయిని శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు మిట్టపల్లి మల్లేశం, చేప్యాల నారాయణరెడ్డి, మగ్బుల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మారం,ఫిబ్రవరి27: మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన తూడి శంకర్(43) ఆత్మహత్యా యత్నానికి పాల్పడి కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో చికి త్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఈనెల 23న గ్రామంలోని తన పొలం వద్ద తాగిన మైకంలో పురుగుల మందు సేవించాడు. అతనిని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం శంకర్ చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.